# మానవత్వానికి మారణహోమం

కొంపెల్ల విశ్వం



తీరికగ పడకకుర్చీలో కూచుని చుట్ట కాలుస్తున్న మునసబుగారు, శంకరం తన ఇంటి ముందునుంచి వెళ్లటం చూసి ఒకసారి నవ్వి పలకరించబోయారు.

శంకరాన్ని చూసినప్పుడల్లా ఆయనకు రావులమ్మ గుర్తుకొస్తుంది. 'రావులమ్మను శంకరానికిచ్చి చేస్తే బాగుంటుంది' — అది ఆయన ఆలోచన. రావులమ్మ మునసబుగారి కూతురు.

ఆయనకీ ఆలోచన రాగానే మరో మనిషి గుర్తుకొస్తుంది. ఆ మరో మనిషి— సుశీల, శంకరం చెల్లెలు. శంకరం సుశీలకు పెళ్లి చేస్తేనేగాని తను చేసుకోడని మునసబుగారికి తెలుసు.

పోనీ ప్రెసిడెంటునో కరణాన్నో వెళ్లి అడుగుతే!' అరక్షణంసేపు బాగనే వుందనిపించిందా ఆలోచన. తరువాత తనని తనే తిట్టుకున్నారు మునసబుగారు. ప్రెసిడెంటుకీ కరణానికీ శంకరం అంటే కిట్టదు.

శంకరం తెలివితేటలు చూసి వాళ్ళు కళ్లల్లో నిప్పులు పోసుకుంటున్నారో లేక శంకరం మంచితనమే వాళ్ల కళ్లల్లో నిప్పులు పోస్తోందో మునసబుగారికి తెలీదు.

నాలుగేళ్ల క్రితం బియ్యే పాసయి ఉద్యోగాలకు పోకుండా ఉన్న పొలాన్నీ, తోడబుట్టిన చెల్లెల్నీ కనిపెట్టుకుని ఉంటున్నాడు శంకరం.

ఎవరికే కష్టం వచ్చినా, అవసరం వచ్చినా ఆదుకుంటాడని — శంకరమంటే ఊళ్లో వాళ్లందరికీ ఇష్టమే.

చిత్రమేమిటంటే—అతనంటే ఇష్టపడే వాళ్లే ప్రెసిడెంటువద్ద, కరణంవద్ద అతన్ని తిడతారు. అతన్ది తప్పులేదని తెలుసున్నా వాళ్ల ఆధిక్యాన్ని కాదనలేక తిడతారు.

ప్రెసిడెంటుగారికి కుడిభుజం లేదు. ఆ మధ్య ఆయన కుడిభుజం పాడయిందని తీసేశారు. అయితే, ఆయనకా లోటేమీ లేదు, కరణంగారున్నారు కాబట్టి.

ప్రెసిడెంటుగారికి శంకరమంటే ఒళ్లు మంట. అందుచేత, ఆయన కుడిభుజంగారికీ శంకరమంటే ఒళ్లు మంట.

'అందరికీ సహాయం చేయటం'—ఏదో సరదాలేదు. ఖాళీగా వున్నాడు, చేస్తున్నాడు. కానీ వీడిలా ఉపేక్షించి వూరుకుంటే వీడి మంచితనంతో ప్రజల బుర్రలను కొనేసుకుని వచ్చే ఎన్నికలలో తనకు ఏకు మేకయి కూచుంటాడేమోనని ప్రెసిడెంటుగారికి సందేహం వచ్చింది.

సరిగ్గా ఆ అనుమానం వచ్చిన రోజుల లోనే శంకరం రాత్రివేళ గ్రామికజనంకోసం బడి నడపటానికి ప్రయత్నిస్తున్నాడని ప్రెసిడెంటుగారికి తెలిసింది.

ఈ వార్త తెలియటానికి ముందే ప్రెసిడెంటుగారి వంటికి నీరు పట్టిందేమో, ఆ నీరు కాస్తా కారిపోయింది.

పులి మీద పుట్రలాగ మరొక వార్త తెలిసింది ప్రెసిడెంటుగారికి. గతం ఎన్నికలలో తనమీద పోటీచేసి ఓడిపోయిన భూషణం కేరాఫ్ అతిగాజనానికి శంకరం ఏదో సహాయంచేసి ప్రేమపాత్రుడయ్యాడనీ, దానితో వాడు ప్రొద్దుటే దేవుణ్ణి కొలవటం మానేసి శంకరాన్ని కొలుస్తున్నాడనీ.

దాంతో సింహస్వప్నంలా తయారయ్యాడు శంకరం, ప్రెసిడెంటుగారికి.

అయితే నిజానికి మంచితనం తప్ప శంకరానికి పార్టీ ఏమీ లేదు.

సమయంకోసం—డబ్బు వెదజల్లి కొంత మంది జనాన్ని ఆకట్టుకుని వేచి చూస్తున్నారు ప్రెసిడెంటుగారు; కాటు వేయటానికి పొంచివున్న కోడెత్రాచులా. త్రాచుకి పంట్లోనే విషం ఉంటే ప్రెసిడెంటుగారికి నిలువెల్లా విషమే వుంది.

* * *

జీవితాన్ని చక్రంతో పోలుస్తారు గాని, అసలు ప్రతిరోజూ ఒక చక్రంలాంటి జీవి

తాన్ని గడుపుతున్నాడు మనిషి!

తెల్లవారింది. ఎవరి పనితో వారు నలుగుతూ ఎవరి బేరంలో వారు తిరుగుతూ మరో చక్రాన్ని ప్రారంభిస్తున్నారు.

ఇల్లు తుడిచి ఆ దుమ్మును చెత్త కుండీలో పారబోసింది కరణంగారి కామాక్షి.

అవతల వీధిలో కుక్క మొరిగింది. దాన్ని విని ఈ వీధిలో మరొక కుక్క మొరిగింది.

ఎవరో అబ్బాయి ప్రొద్దుటే కోడిగ్రుడ్లు త్రాగి గుల్లలు చెత్తకుండీలో పారేశాడు.

మునసబుగారింట్లో ఏదో శుభ్రం చేస్తుంటే ఒక ఫోటో క్రిందపడి అద్దం పగిలి ముక్కలైంది. వాటిని జాగ్రత్తగ చేటతో అద్ది పాత చేటలో కెత్తుకుని పారేయటానికి వచ్చాడు పేరిగాడు.

బరువు మోస్తున్న భూమాత గుర్తు కొస్తుంది ఆ చెత్తకుండీని చూస్తే! అది శుభ్రంచేసి ఎన్నాళ్లయిందో ఏమోగాని దాని నిండా చెత్త పేరుకుంది. ఆ చెత్త మీద ఒక కాకి నుంచుని ముక్కుతో ఏదో పొడుస్తోంది.

శంకరం ప్రొద్దుటే పొలానికని ఆ దారిన పోతుంటే వెంకటరావుగారి పనిమనిషి ఏదో పారేయటానికి వెళ్ళి కుండీలో ఏదో కదుల్తున్నట్లనిపించి, చూసి కెవ్వున అరచింది.

పనిమనిషి నడిగి విషయం తెలుసుకో నక్కరలేకుండానే కుండీలోంచి పసికందు ఏడుపు వినవడుతోంది.

ఎవరికీ పనికిరాని వస్తువులను మాత్రమే పడవేసే చెత్తకుండీ కుండీ నిండా చెత్త మధ్యలో పసికందు. పసికందుపైనా కొంత చెత్త.

శంకరం, దారినపోయే మరొకరు కలిసి ఆ పాపను పైకి తీశారు. ఇంకా బొడ్డు వూడలేదు. కాదు; ఎవరో బొడ్డు కూడ కోసే వ్యవధి లేకుండానే ఆ కుండీలో వదిలి వెళ్ళిపోయారు.

చుట్టూ ఒక పల్చటి గుడ్డ. కాకి ముక్కుతో పొడిచినట్లుంది. చిన్నగా కాలి మీద రక్తం వస్తోంది. ఎర్రటి ఏడుపు లాంటి రక్తం.

మంకెన్న పూవులా ఎర్రగా వుందా పసిపాప. పెరిగి పెద్దదై కొన్ని ప్రాణాలను తయారు చేయగలదు ఆ పసికందు. కాని— ఆ పాప పెద్దగ ఏడుస్తోంది. అది పేదవాడి ఆకలి మంటలా ఆరని ఆగని ఏడుపు.

జనం పోగయ్యారు.

'పోయేకాలం! కన్న బిడ్డని ఎలా పడ వేయగలిగారో?'

'ఎంత ముద్దుగా వుందో పాప!'

'కాలి కేమైందోనమ్మా!'

'మొన్న మా వాళ్ళగాడికి జలుబు చేస్తేనే వలవల్లాడి పోయాను. బిడ్డ నొదులుకుందుకు మనస్సెలా వచ్చిందో!'

ఒకప్రక్క అమ్మలక్కల వ్యాఖ్యానాలు.

'నాయాల్ది! ఈ బిడ్డనిక్కడ పడేసినోల్లని ఉరి తీసేయాలి!'

'ప్రపంచకం కాస్తా చెడిపోయింది'

'కళ్ళు మూసుకుని ఎవడితోనో ... ఆ తరువాత ఎవరి పనులకు తయారవడమును' మరొక ప్రక్క పురుష పుంగవుల తీర్మానాలు.

ప్రెసిడెంటుగారు, కరణంగారు వచ్చి విషయం సావధానంగ విన్నారు.

'ఈ పిల్ల—ఇంతకీ ఎవరి పిల్లంటావు?' చుట్ట చివర తెంపి. చుట్టను ఎడం చేత్తో పట్టుకుని అడిగారు ప్రెసిడెంటుగారు.

'అదే! ఎవరి పిల్లంటావు?' ప్రెసిడెంటుగారి ప్రశ్నకు కరణంగారి ప్రశ్న జవాబు.

ఎవరి ఆలోచనలలో వారున్నారు కాని, ఆ పాపను ఎవరూ తీసుకోలేదు.

కొంతమంది ఏదో పాప వింతలాన్ని చూస్తున్నట్లు నిలుచున్నారు. మరి కొంత మంది ఆ పాపను ముట్టుకుంటే మైలపడి పోతామన్నట్లు ఊరకున్నారు.

కాసేపటికి చెంచులక్ష్మి ఒక నిర్ణయానికి వచ్చినట్లు కదిలి.

'బాబుగారూ! ఈపిల్ల ఎవరిదైంది ఆలోచన అనవసరం. నా మనవి ఏమిటంటే తమరు దయ తలిస్తే ఈ బిడ్డను నేను పెంచుకుంటాను' అన్నది ప్రెసిడెంటుగారి నుద్దేశించి.

అది శంకరం విన్నాడు. ఎవరో తెచ్చిన గుడ్డను ఆ పాపకు చుట్టి పట్టుకుని అర్థమైన మనసుతో ఆమెకేసి చూశాడు.

'ఈ పాపను నేనే పెంచాలి. అది కన్నమే కావచ్చు. ఈ విషయం చెడితే సహృదయంతో అర్థం చేసుకునే మనిషి దొరుకుతే పెళ్లాడుతాను. లేకపోతే ఇలాగే వుంటాను' [illegible] అనుకున్నాడు శంకరం.

చెంచులక్ష్మి తీసుకెళితే ఆ పాప గతి ఏమవుతుందో శంకరానికి తెలుసు. చుట్టు ప్రక్కల వూళ్ళనుంచి వయసులో వున్న అమ్మాయిలను తీసుకొచ్చి వాళ్ళవల్ల డబ్బు సంపాదిస్తుంది చెంచులక్ష్మి. అంత చిన్న వూరిలో కూడ అటువంటివి ఉన్నాయంటే ఆశ్చర్యంగ వుండవచ్చునేమోగాని, ఈ సువిశాల పవిత్ర భారతదేశంలో అవి లేని దెక్కడ?

'ఈ పాపను నేను పెంచుతాను' నెమ్మదిగానైనా దృఢంగా అన్నాడు శంకరం.

ఏమనుకుందో ఏమో చెంచులక్ష్మి శంకరం కేసి చుర చుర చూసి వెళ్ళిపోయింది.

పాపను పొదివి పట్టుకుని రెండడుగు లేశాడు శంకరం.

చేనుకి అమోఘయాలాగ ప్రెసిడెంటుగారి బుర్రకి మంచి వస్తువు దొరికింది. శంకరం పైన తనకున్న కసి, కోపం తీర్చుకోవా లంటే ఇది మంచి అవకాశం. ఇంతకన్న మంచి అవకాశం మరి రాదేమో కూడాను!

'ఎవరో కన్నబిడ్డయితే—ఈ శంకరాని కెందుకంటావ్ ఇంత ప్రేమ'

'అయితే ఈ పాపకు తండ్రీ—' [illegible] అనుమానం.

'ఈ పాపకు తండ్రి—అని ఆలోచి[illegible] వేసయ్యా! శంకరమే ఆ పిల్లకు తండ్రి! మన మింతమంది ఇక్కడున్నామా, మన కెవరికీ ఆ పనిచేయాలని ఎందు కనిపించ లేదంటావు?' తన చేతకాని తనానికి అందమైన ముసుగువేసే మనిషి బలహీనత.

'రక్త సంబంధమయ్యా! [illegible] ఆ పిల్లకూ రక్త సంబంధం లేకుంటే మన్నెవడు తీసికెళ్లే వాడిని!' ఎదుటివాడి మంచి తనాన్ని తమ వెకిలితనంతో కప్పేయగల సమర్థత.

నలుగురూ నాల్గుమాట్లూ పోగయ్యారు. శంకరం ఆ మాటలు వింటూ నడుస్తున్నాడు. నడవలేక నడుస్తున్నాడు.

'మరి—చెంచులక్ష్మి తీసికెళితా నందిగా' ఎవరో అడిగారు.

'అడిగితే మనాదేమన్నాడు?' ఎదురు ప్రశ్న.

'ఏ మయ్యోయ్! ఒకటే చెబుతా వినవో మనిషి — [illegible], పాపతో

## మానవత్వానికి...

అప్పుడు వెదుకులాడి ఉండదన్నటానికి వీల్లేదు.'

'అందులో రోజా ఎలా వున్నాయి?'

'ఇంతకీ మనవాడి ప్రియురాలెవరు?'

'మీకు నాకూ తెలిసేట్లా వుంటారండయ్యా ప్రియురాళ్లు!'

'ప్రజాసేవ, వయోజన విద్య అంటూ పెద్ద కబుర్లు చెబుతాడేం మరి!'

'నవ్వును—అందుకు.'

'ముందే ఆ బిడ్డను తను పెంచుకోవచ్చుగా! చెత్తకుండీలో పారవేయటమెందుకు?' రావల్సిన అనుమానం వచ్చింది ఎవరికో.

'కాని బ్రహ్మాండంగా ఆట కట్టేశారు కరణంగారు.

'బాగుందయ్యా వరస! వాళ్లింట్లో ఒక పసికందు పెరుగుతుంటే చూస్తూ మనమెలా వూరుకుంటాం? అదేగాక—వాళ్ల చెల్లెల్ని అనుమానంతో ఎవరూ చేసుకోరు.'

అక్కణ్ణించి ప్రెసిడెంటుగారు అందుకున్నారు. 'అందుచేత — ఏ తెల్లవారు ఝామునో ఆ పిల్లను చెత్తకుండీలో పారేసి, ప్రొద్దున్నే ఏమీ ఎరగనట్టు తయారై ప్రజాసేవ పేరుతో తనే తీసికెళ్లి పెంచాలని ప్లానువేశాడు.'

నవ్వులు! శ్రుతిలేని నవ్వులు!! మతి పోగొట్టే నవ్వులు!!! ఒక మంచి మనసును గాయపరచే పదునైన నవ్వులు!!!

వాదాలు, ప్రతివాదాలు, తీర్మానాలు! చివరకు—అందరూ వరుసన వచ్చి శంకరాన్ని చుట్టుముట్టారు.

'ఏమిటి ఆ పాపకూ నీకూ సంబంధం'

'ఆ పాప నీకేమౌతుంది?'

'మాట్లాడవేం?'

'ఇలా మంచిగా అడిగితే చెబుతాడేమిటి? రెండు తగలనీయండయ్యా.'

'ఊ! చూస్తారేం?' పంజా విప్పి దెబ్బ తీయటానికి సిద్ధంగా వున్న సింహాలల్లా వున్నారు వాళ్లు.

ఎవరో శంకరాన్ని బలంగా త్రోశారు. మరెవరో శంకరాన్ని కొట్టారు. ఒకరి ప్రమేయం లేకుండా, ఎవరికి తోచినది వారు చేస్తున్నారు.

శంకరం క్రింద పడ్డాడు. తలరాయి మీదపడింది. పాప మరెక్కడో పడింది.

వాళ్లవి చేతులుకాదు.

వాళ్లవి చేతలుకావు

వాళ్లు మనుషులుకారు.

గట్టిగా పాప ఏడుపువినబడి, అంతలో అది పోయింది.

'నా కింతవరకూ అందరూ పనికిరాని చెత్తనే ప్రసాదించారు. ఇన్నాళ్లకు ఎవరో నాకొక బిడ్డను ప్రసాదిస్తే ఆ బిడ్డను కూడ మీరు దూరం చేశారు' అన్నట్టు రోదిస్తూ నిలబడింది చెత్తకుండీ.

శంకరానికి స్పృహపోతున్నట్టనిపించింది. నిస్సత్తువగా కళ్లు మూసుకున్నాడు. అతని మనోనేత్రానికి ఆ మనుషు లెవరూ కనబడటం లేదు. వారి స్థానే ఒక పెద్ద మంట కనిపిస్తోంది. అందులోంచి, మానవత్వం పడి మండి, మాడి మసైపోతున్నాయి. ●

---

## ప్రశ్నావళి

**ఎస్. జె, హైదరాబాదు**

కొందరు మాతృభాషను ఖూని చేస్తూ మాట్లాడుతారు. కాని పరభాష అయిన ఇంగ్లీషులో చిన్న తప్పు దొర్లినా సిగ్గుపడిపోతారు. కారణం ?

మాతృభాష సనాతనం. నవీనం. కాని పరభాషకి—అన్యాయం చేయడం అన్యాయంకదా.

**వి. ఎస్. ఎమ్, వి. పి. ఆర్, ఖండ్రిక**

ధనవంతులు నకిలీ ఆభరణములు ధరించినా బంగారం అంటారు. పేదవారు నిజమైన బంగారువి ధరించినా నకిలీవి అనుకుంటారు. కారణం ?

అది లోకం తీరు. దానికి కారణం వుండదు.

**టి. ఇ. ఆర్, తాళ్లబుగ్గ**

త్రాగుబోతునకు, మంచివానికి గల సంబంధం వివరిస్తారా ?

ఏం? మంచివాడు త్రాగడనా మీ ఉద్దేశం?

**వి. ఎస్. ఆర్, గుంటకల్**

భార్యను వదిలేస్తే మగవాడిని నమ్మించిన సంఘం భర్త వదిలేసిన భార్యను విమర్శిస్తుంది ఎందుచేత ?

ఇదింకా సంప్రదాయంగా మారిపోలేదు, కనుక.

కాలం పోను పోను భార్యను వదిలేయడం భర్తకి ఎంత మామూలో, భర్తను వదిలేయడం భార్యకీ అంత మామూలు అయిపోయింది.

**ఐ. ఎస్. ఆర్, తుని**

మీరు ఆడవాళ్ళను ఒకలాగ, మగవాళ్ళకు ఒకలాగ జవాబిస్తుంటారు. కారణం ?

మరింకెలా ఇవ్వాలిసార్.... అందరికీ ఒకలాగే ఇస్తే ఏంబాగుంటుంది?!

**ఎస్. ఎమ్, కాకినాడ**

ఒక మనిషిని మరొక మనిషి అర్థం చేసుకోలేనప్పుడు ఆ బ్రతుకు అనవసరం అంటాను.

మరెలా! అప్పుడిక ఈ ప్రపంచంలో మనుష్యులే వుండరే!

**ఆర్. ఆర్, కె. ఎస్. ఆర్, కోడూరు**

తెలిసి చేసిన తప్పుకు, తెలియక చేసిన తప్పుకు తేడా ఏమిటి ?

తేడా ఏం లేదు— రెండింటికీ ఫలితం అనుభవించక తప్పదు కనుక.

**ఎస్. వి. ఆర్, భువనేశ్వర్**

అసలు లోపాలు లేని వ్యక్తులే వుండరా?

ఉంటారు. కాని ఒకటో అరో లోపాలులేని వ్యక్తిత్వాన్ని ప్రేమించడం కష్టం అనూరాధా.

**పి. కె. కె. సికింద్రాబాదు**

ఈ జీవితంలోంచి పూర్తిగా కష్టాలు తొలగిపోయే మార్గం లేదా అక్కయ్యా?

ఒక్కొక్కప్పుడు నాకేం అనిపిస్తుందో తెలుసా కమల కుమారీ— మనకష్టాల్లో సగానికిపైగా వూహించుకున్నవే. వాటిని పట్టించుకోకుండా వుంటే అవే పోతాయి.

**వి. ఎస్. పి. ఆర్, ఊటుకూరు**

కావ్యాన్ని కన్నెతో పోలుస్తారెందుకు?

కన్నెపిల్లలాగే—సుకుమారంగా, సుందరంగా— మనస్సుకి ఆహ్లాదకరంగా తన స్వంతం చేసుకోవాలన్న కోరిక పుట్టించేదిగా వుంటుంది. కనుక కావ్యాన్ని కన్నెపిల్లతో పోల్చేవారు. ఇది ఇప్పటి పద్య వచన కావ్యాలకి వర్తించదు. శిరపిడికిలి బిగించి ముక్కు బద్దలకొడతామనే నేటి కావ్యధోరణులని ఇంకదేనితో నైనా పోల్చండి!

ఏమండీ, కలసిన మనుషులు కోరదేమిటి?

ఏకాంతం! —కె. రామలక్ష్మి ●

---

Printed and Published by S. Nageswara Rao at the Andhra Patrika Press: 6 & 7, Thambu Chetty Street, Madras-1, and at Andhra Patrika Press, Mallikarjuna Rao Street, Gandhinagar, Vijayawada-3.
Editor : S. Radhakrishna.